

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

బెలగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తామని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి ఇ.అప్పన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 3లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. విద్య, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్, పాన్‌కార్డు, 2 ఫొటోలను దరఖాస్తుకు జతచేసి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

పౌర సేవలకు నిరీక్షణ!







- సక్రమంగా అమలుకాని సిటిజన్ చార్టర్
- కాగితాలకే పరిమితమైన సేవలు
- రోజుల తరబడి పరిష్కారంకాని దరఖాస్తులు
- శ్రద్ధచూపని అధికారులు, పాలకవర్గ సభ్యులు

పార్వతీపురంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మునిసిపాలిటీలో సిటిజన్ చార్టర్ సక్రమంగా అమలు కావడం లేదు. కేవలం కాగితాలకే సిటిజన్ చార్టర్ పరిమితమైందనే విమర్శలు ఉన్నాయి. కనీస సేవలు అందక పుర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపాలిటీలోని 30 వార్డుల ప్రజలకు ఒకే చోట.. సత్వరం, సులభతరంగా పౌర సేవలు అందేలా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సిటిజన్ చార్టర్ ఏర్పాటు చేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ సేవలను పూర్తిగా గాలికొదిలేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన సేవలు సక్రమంగా అందడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పురసేవలు రోజురోజుకూ అధ్వానంగా ఉన్నాయని ప్రజాసంఘాలు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా సిటిజన్ చార్టర్ సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేయాలని కోరుతున్నారు.

ప్రజారోగ్య విభాగం..

ఈ విభాగం సేవలు మరి అధ్వానంగా ఉన్నాయి. 30 వార్డుల్లో పారిశుధ్యం లోపించినా అధికారులు గాని, పాలకవర్గ సభ్యులు గాని పట్టించుకోవడం లేదు. పారిశుధ్యం నిర్వహణ దారుణంగా ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఫిర్యాదు వెళ్లిన ఒకట్రెండు రోజుల్లో ఆ సమస్యను పరిష్కరించాలి. కానీ, ఆ ఫిర్యాదు (మిగతా 6వ పేజీలో..)

ఇంజనీరింగ్ విభాగం..

మునిసిపాలిటీలో తాగునీటి సరఫరాకు ఆయువుపట్టువంటిది ఇంజనీరింగ్ విభాగం. అయితే, ఈ విభాగంపై పలు ఆరోపణలు ఉన్నాయి. కుళాయి కనెక్షన్ కోసం ప్రజలు సిటిజన్ చార్టర్ ప్రకారం దరఖాస్తు చేసుకుంటే మంజూరు కావడం లేదు. సంబంధిత అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

అదే డబ్బులు చెల్లించిన వారికి క్షణాల్లో కుళాయిలను ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాగునీటి పైపులైన్, కుళాయిల లీకులకు సంబంధించి ఫిర్యాదులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేయాల్సిన ఉంది. కానీ, ఆ సమస్య పరిష్కారానికి వారం రోజులకు పైనే అవుతుందని ఫిర్యాదుదారులు చెబుతున్నారు. అధికారులు మాత్రం సిటిజన్ చార్టర్ సక్రమంగా అమలు చేస్తున్నామని చెబుతున్నారు.

రెవెన్యూ విభాగం..

మునిసిపల్ విభాగాల్లో మరో కీలకమైనది రెవెన్యూశాఖ. ఇక్కడ కూడా పౌర సేవల్లో జాప్యం జరుగుతుందనే విమర్శలు ఉన్నాయి. ఇంటి పన్ను విధింపుతో పాటు డోర్ నంబరు కేటాయింపునకు సంబంధించి సచివాలయ వ్యవస్థ అందుబాటులో ఉన్నప్పటికీ వారం రోజులకు పైగా జాప్యం జరుగుతుందని నివాసితులే చెబుతున్నారు. ఇంటి పన్ను మార్పులు, చేర్పులు, ఇళ్ల క్రయ విక్రయాలకు సంబంధించి ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. ఈ దరఖాస్తులు రెవెన్యూ అధికారుల టేబుల వద్ద పేరుకుపోతున్నాయి. ఎన్‌వోసీ రాకపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్ల అసిసెమెంట్ ధ్రువపత్రాలను వారం రోజుల్లో మంజూరు చేయాల్సి ఉన్నా, నెలల తరబడి అధికారులు తిప్పిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇంటి పన్నులకు సంబంధించిన ధ్రువపత్రాలు మంజూరుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై దరఖాస్తుదారులు ఏసీబీ అధికారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గతంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పి.ఈశ్వరరావు, శంకరరావు ఏసీబీకి చిక్కారు.

కళాశాల నుంచి కార్యక్షేత్రంలోకి..
- ఎనిమిది ఎకరాల్లో ప్రకృతి సేద్యం
- ఖరీఫ్‌లో 18 రకాల వరి పంటలు
- రబీలో అపరాల సాగు
- ఇది కంచరాం రైతు శ్రీనాథ్ ప్రత్యేకత

4లో

మంచంపై రోగి తరలింపు
- నాలుగు రోజులుగా జ్వరం.. ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి..
- నీలకంఠాపురం నుంచి తోలంగూడ వరకు రోడ్డు నిర్మించాలని డిమాండ్

4లో

ఐటీడీఏలో అక్రమాలపై నివేదిక
- విచారణాధికారి, ట్రైకార్ ఎండీ మణికుమార్

4లో

రైతులకు చెల్లింపుల్లో జాప్యం వద్దు
- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

4లో

డ్రగ్స్ మహమ్మారితో యువత భవిష్యత్తు అంధకారం
- బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి

4లో

వీధిదీపాలు, సెంటర్ లైటింగ్
నిర్వహణ అస్తవ్యస్తం

పార్వతీపురంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో వీధిదీపాలు, సెంటర్ లైటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వీటి కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పటికీ, నిర్వహణలో మాత్రం సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారే విమర్శలు ఉన్నాయి. చాలావార్డుల్లో వీధిదీపాలు, సెంటర్ లైటింగ్ వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ శివారులో ఉన్న కాలనీల్లో పరిస్థితి దారుణంగా ఉంది. రాత్రి వేళల్లో దీపాలు వెలగకపోవడంతో ఆ వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. వీధి దీపాలు, సెంటర్ లైటింగ్ నిర్వహణను విశాఖపట్నానికి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ చూస్తుంది. ఈ సంస్థకు మునిసిపాలిటీ సుమారు రూ.20 లక్షల వరకు బకాయిపడి ఉంది. దీనివల్ల ఆ సంస్థకు చెందిన సిబ్బందికి జీతాలు అందక అసంతృప్తితో ఉన్నారు. దీంతో వీధిదీపాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ఈ విషయమై మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం ఏఈ సన్యాసిరావును వివరణ కోరగా.. 'వీధిలైట్లు, సెంటర్ లైటింగ్ నిర్వహణపై ఎటువంటి నిర్లక్ష్యం, అశ్రద్ధ చూపకుండా చర్యలు చేపడతాం.' అని తెలిపారు.



పట్టణంలో సెంటర్ స్తంభాలకు దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

లక్ష్యం ఎక్కువ..
కొనుగోలు తక్కువ

- ధాన్యం సేకరణలో జాప్యం
- ఇప్పటి వరకు 7,800 మెట్రిక్ టన్నులే కొనుగోలు
- ప్రభుత్వ లక్ష్యానికి గండి కొడుతున్న వ్యాపారులు
- రైతుల శ్రమను దోచుకుంటున్న దళారులు

పార్వతీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయని.. గత ఏడాది కంటే వేగవంతంగా కొనుగోలు చేస్తున్నామని అధికారులు గొప్పలు చెబుతున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఈ ఏడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 7,800 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు జరిగాయి. గత ఏడాది ఇదే సమయానికి 9వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నా రైతులు మాత్రం వ్యాపారులకు అధికంగా విక్రయిస్తున్నారు. దీనివల్ల కొనుగోలు లక్ష్యం తగ్గుతుంది. వాస్తవానికి ప్రభుత్వం క్వింటా సాధారణ రకం ధాన్యం రూ.2,369, గ్రేడ్-1 రకం రూ.2,389 చెల్లిస్తుంది. 80కేజీల బస్తాకు సాధారణ రకం రూ.1,895, గ్రేడ్-1 రకం రూ.1,911 ధర అందిస్తుంది. శాస్త్రీయ పద్ధతిలో తేమ, ఈలింగ్ మొదలగు నాణ్యత ప్రమాణాలను పరిశీలించి అందుకు అనుగుణంగా ధాన్యం ఉంటేనే ఈ మద్దతు ధర లభిస్తుంది. అయితే, ఈ నిబంధనల కారణంగా జిల్లాలో చాలామంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు రైతులు సాగు పెట్టుబడి (మిగతా 6వ పేజీలో..)



పార్వతీపురం మండలం సంగవలస పంచాయతీలో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

రూ.25 కోట్లకే పరిమితమైన బ్యాంక్ గ్యారెంటీలు..

మిల్లర్లు తమ బ్యాంకు గ్యారెంటీలను ఇప్పటి వరకు రూ.25కోట్ల వరకే అందించారు. జిల్లాలో 104 రైస్ మిల్లులు ఉన్నాయి. ఇందులో కేవలం 50 మిల్లులు మాత్రమే బ్యాంకు గ్యారెంటీలు అందించాయి. బ్యాంకు గ్యారెంటీలు రూ.200 కోట్లు రావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కేవలం రూ.25 కోట్లు మాత్రమే వచ్చాయంటే ధాన్యం కొనుగోలు పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఇలా అయితే ప్రభుత్వ లక్ష్యాలు ఏ విధంగా నెరవేరుతాయో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా కొనుగోలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

అక్విడక్ట్ పూర్తికాక..
సాగునీరు అందక

- బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిన పనులు
- రైతులకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నపం

మక్కువ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని అక్విడక్ట్ పనులు సంవత్సరాలుగా నిలిచిపోవడంతో సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మక్కువ మండలంలో 14,550 ఎకరాలు, సీతానగరం మండలంలో 3,723 ఎకరాలు, విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో 6,127 ఎకరాలు మొత్తం 24,700 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. సుమారు రూ.11కోట్ల వ్యయంతో పది పిల్లర్లతో నిర్మించిన అక్విడక్ట్ 2008లో కుప్పకూలిపోయింది. దీంతో ఎడమ కాలువ పరిధిలోని 8వేల ఎకరాలకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు గోముఖి లింక్‌చానల్ నిర్మించి ఎడమ కాలువకు అనుసంధానం చేశారు. ఈ చానల్ ద్వారా వచ్చే నీటిని ఎడమ కాలువలోకి విడిచిపెట్టి తద్వారా పంట పొలాలకు సరఫరా చేస్తున్నారు. అయితే, ఈ నీరు కూడా పూర్తిగా సరఫరా కాకపోవడంతో అధికారులు వెంగళరాయసాగర్ రెండో కిలోమీటర్ వద్ద కొత్తగా అక్విడక్ట్‌ను నిర్మించేందుకు 2012లో నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు పది పిల్లర్లతో పాటు దోనెను నిర్మించాల్సి ఉంది. 2015 వరకు (మిగతా 6వ పేజీలో..)



నిలిచిన ఎడమ కాలువ అక్విడక్ట్ నిర్మాణం

చర్యలు తీసుకుంటాం

ఈ డిసెంబరులో పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. జైకా నిధులు విడుదల చేయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వచ్చే నెలాఖరుకు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం. ఆ వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం.

-డి.సురేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వీఆర్‌ఎస్ ప్రాజెక్టు

పర్యాటక కేంద్రంగా తోటపల్లి

- తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు
- ప్రభుత్వ విప్ జగదీశ్వరి, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
- ఐటీడీఏ పార్కు పునఃప్రారంభం
- బోటు షికారు కూడా..

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సుంకి ప్రాంతంలోని పార్వతీపురం ఐటీడీఏ పార్కును గురువారం వారు పునఃప్రారంభించారు. బోటు షికారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ జగదీశ్వరి మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో పార్కుతో పాటు బోటు షికారు మూలకు చేరిందన్నారు. ఈ ప్రాంతం పర్యాటకానికి అనువుగా ఉన్నా వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి పార్కు అభివృద్ధితో పాటు బోటు షికారుకు అవసరమైన చర్యలను కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి చేపట్టారన్నారు. యంత్రాంగం చొరవతో తోటపల్లికి కొత్తదనం సంతరించుకుందని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. తోటపల్లిని అభివృద్ధి చేయాలని ప్రత్యేక సంకల్పంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ బాధ్యతను పార్వతీపురం ఐటీడీఏ శాఖకు (మిగతా 6వ పేజీలో..)



ఐటీడీఏ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, జాయింట్ కలెక్టర్

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

బెలగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం సీఎస్ విజయానంద్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షానికి ధాన్యం తడవకుండా రైతుల నుంచి సేకరించాలని సీఎస్ తెలిపారని కలెక్టర్ చెప్పారు. ఈ సమీక్షలో జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, డీఆర్వో హేమలత, తదితర అధికారులు పాల్గొన్నారు.

- ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద అర్హులైన మిగిలిపోయిన గృహనిర్మాణ లబ్ధిదారులు వెంటనే పంచాయతీలోని సర్వేబృందాన్ని కలిసి పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సర్వే 10న ప్రారంభించామని అన్నారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కళాశాల నుంచి కార్యక్షేత్రంలోకి..

- ఎనిమిది ఎకరాలలో ప్రకృతి సేద్యం
- ఖరీఫ్‌లో 18 రకాల వరి పంటలు
- రబీలో అపరాల సాగు
- ఇది కంచరాం రైతు శ్రీనాథ్ ప్రత్యేకత



పలురకాల వరి పంట

రాజాం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆయన ఓ ప్రయివేటు కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్. మంచి జీతం. భార్యకూ ఉద్యోగం ఉంది. జీవితం హాయిగానే సాగుతోంది. కానీ ఏదో అసంతృప్తి అతన్ని వెంటాడింది. మనసుకు నచ్చిన పని ఏదో చేయాలనే తపన మొదలైంది. సరిగ్గా అదే సమయంలో అతని అన్నయ్య తెచ్చిన పుస్తకం అతనిని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయించేలా చేసింది. కుటుంబ సభ్యులతో చర్చించి ఉద్యోగానికి రాజీనామా చేశారు. పొలం బాట పట్టారు. కార్యక్షేత్రం'లోకి దిగారు. ఉన్న ఎనిమిది ఎకరాలలో ఖరీఫ్‌లో 18 రకాల వరిని పండిస్తున్నారు. ఆర్గానిక్ పంటలు సాగుచేస్తూ.. సొంతానికి వాడుకోవడమే కాకుండా... స్నేహితులు, బంధువులకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా దేశీయ విత్తనాలను ఈ తరహా సేద్యంపై ఆసక్తి ఉన్న రైతులకు సరఫరా చేస్తున్నారు ఆయనే మండల పరిధిలోని కంచరాం గ్రామానికి చెందిన యువరైతు పొదిలాపు శ్రీనాథ్.



కాలాబట్టి పంటను చూపిస్తున్న రైతు శ్రీనాథ్

● వరిలో రకాలివిగో..

ప్రధాన పంటగా సాగుచేస్తున్న వరిలో శ్రీనాథ్ 18 రకాల వంగడాలను ఉపయోగిస్తున్నారు. కొన్ని రకాలు విత్తనాల కోసం... మరికొన్ని రకాలు వినియోగానికి... అమ్మకానికి వీలుగా సాగుచేస్తున్నారు. ముఖ్యంగా నారాయణ కామిని, చికిలా కోయిల, రాజ్‌ముడి, ఒడిశా బాస్మతి, కాలాజీరా, ఇలప శాంబ, రత్నచోడి, మైసూర్ మల్లిక, కుంకుమసాలి, పరిమళ సన్నాలు, చిట్టిముత్యాలు, తులసిబాసో, కుజి పటాలియా, బహురూపి, చింతలూరి సన్నాలు, శివగాజ, కాలాబట్ట వంగడాలను సాగు చేస్తున్నారు.

● తక్కువ ఖర్చుతో..

వరికి సంబంధించి జులై రెండోవారంలో ప్రారంభిస్తే... నవంబరు రెండోవారం నుంచి డిసెంబరు పదో తేదీలోపు పూర్తిగా పంట చేతికి వస్తుందని శ్రీనాథ్ తెలిపారు. ఎకరానికి సుమారుగా 20 బస్తాల (1600 కిలోలు) వరి దిగుబడి వస్తుందని వివరించారు. ఎకరానికి సుమారుగా రూ.15 వేల వరకు మాత్రమే ఖర్చవుతుందన్నారు. రసాయన ఎరువులతో సాగుచేసే వరితో పోలిస్తే ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించారు. పది రోజులకోసారి జీవామృతాన్ని పంటలో వాడుతానన్నారు. తోటపల్లి ప్రాజెక్ట్ కాలువ నీటిని ఉపయోగిస్తూ సాగు చేస్తున్నానని చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా దేశీయ వరి విత్తనాలు

● వాణిజ్యపరంగా..

వరి ప్రధాన పంట కాగా... రబీలో మినుములు, పెసలు, ఉలవలు, నువ్వులు, వేరుశెనగ, శెనగ, అరటి, కూరగాయల సాగు చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా ఆర్గానిక్ బెల్లంతో వేరుశనగ పలుకుల ఉండలు, నువ్వుల ఉండలు, మినప సున్నుండలు, బియ్యం నుంచి అటుకులు తయారుచేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటు న్నారు. దేశీయ విత్తనాలతో పాటు ఆహారోత్పత్తు లను మొబైల్ ఆధారంగా ఇంటివద్దనే విక్రయిస్తు న్నారు. ప్రతి ఆదివారం విశాఖలోని ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్ సమీపంలో నిర్వహించే ప్రకృతిసేద్య ఉత్పత్తుల బజార్‌కు తీసుకువెళ్లి అమ్మకం సాగిస్తున్నారు.

● ఆ పుస్తకమే ప్రేరణ..

మా అన్నయ్య శ్రీనివాస్ ప్రకృతిసేద్యంపై తెచ్చిన పుస్తకం నాకు ప్రేరణగా నిలిచింది. అప్పటి వరకూ లెక్చరర్‌గా ఉన్న నేను ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పుస్తకాలను చదవడం ప్రారంభించాను. సేద్యంపై అవగాహన పెంచుకున్నాను. సేద్యం చేసే విధానం, వరిలో రకాలు, దేశీయ విత్తనాలు ఎక్కడెక్కడ లభ్యం అవుతాయో తెలుసుకున్నాను. అప్పటికే ఈ తరహా సాగు చేస్తున్న పంటలను స్వయంగా చూసి.. రైతుల అనుభవాలను తెలుసుకున్నాను. తొలుత ఎకరాతో ప్రారంభించి ప్రస్తుతం ఎనిమిది ఎకరాలలో సాగుచేస్తున్నాను. విజయరామ్, సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తున్నాను.

-శ్రీనాథ్, రైతు, కంచరాం

దళారులను నమ్మి మోసపోవద్దు

- 97 శాతం లక్ష్యాన్ని సాధించాం
- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల కొనుగోలు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లకు సంబంధించి దళారులను నమ్మి మోసపోవద్దని జిల్లా రిజిస్ట్రార్ తంగుడు ఉపేంద్రరావు స్పష్టం చేశారు. పారిశ్రామిక, విద్య, వైద్య, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న రాజాంలో భూముల ధరలు భారీగా పెరిగాయని, ఫలితంగా మోసాలకు అవకాశాలు లేకపోలేదని ఆయన పేర్కొన్నారు. రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కక్షిదారులతో మాట్లాడారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఆస్తులు కొనే సమయంలో ఆస్తికి సంబంధించి సరైన పత్రాలు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని స్పష్టం చేశారు. హక్కుదారుల సర్వేనెంబర్, ఈసీ పరిశీలించాలని అన్నారు. అవసరమైతే కొనుగోలు చేసే భూములకు సంబంధించి స్థానికంగా దర్యాప్తు చేయాలన్నారు. లేకపోతే అలాంటి భూములు ప్రభుత్వానికి చెందినవి, వివాదంలో ఉన్నవి, 22ఎలో నమోదై ఉంటే ఆర్థికంగా నష్టపోతారని ఉపేంద్రరావు పేర్కొన్నారు.

లక్ష్యాన్ని సాధించాం..

జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన రూ.345.11 కోట్ల ఆదాయంలో ఇప్పటి వరకూ 97 శాతం సాధించగలిగామని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఈ లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆయన అన్నారు. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో కక్షిదారులకు న్యాయం జరగకపోతే నేరుగా తనను ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఉపేంద్రరావు స్పష్టం చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

ఫిర్యాదులపై విచారణ..

రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ఫీజుల వసూలుతో పాటు అనధికారిక వ్యక్తులు ద్వారా వసూళ్లు చేపడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది పనితీరుపై కొంతమంది జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా వస్తున్న ఫిర్యాదులపై విచారణకు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు గురువారం రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కొంతమంది నుంచి జిల్లా రిజిస్ట్రార్ లిఖితపూర్వకంగా సమాచారం సేకరించడం... మరికొంతమందిని నేరుగా ప్రశ్నించడం దీనికి బలం చేకూరుస్తోంది. ఇదే విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు వద్ద ప్రస్తావించగా ఇది సాధారణ తనిఖీ మాత్రమేనని తెలిపారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

నెల్లిమర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు తాము తీసుకున్న రుణాలతో స్వయం సమృద్ధి సాధించాలని వెలుగు ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి అన్నారు. నెల్లిమర్లలో ఆదర్శవంతమైన మండల సమాఖ్యలకు సంబంధించి వార్షిక కార్యాచరణ ప్రణాళిక, జిల్లా స్థాయి శిక్షణ రెండోరోజు కొత్తపేట గ్రామ సంఘంలో నిర్వహించారు. ఈ శిక్షణకు కొత్తపేట గ్రామంలో ఉన్న కార్యవర్గ సభ్యులతో పాటు బొబ్బిలి, బొండపల్లి, ఎస్.కోట, లక్కవరపుకోట, రాజాం, సంతకవిటి, చీపురుపల్లి, గరివిడి మండలాల వెలుగు సిబ్బంది హాజరయ్యారు. ఈ శిక్షణలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, ప్రవర్తనలో మార్పు, సుసిర జీవనోపాధులు తదితర విషయాల ను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సురేష్, అరుణకుమారి, సింహాచలం, భవాని, అప్పలనాయుడు, కుమార్, భాగ్యలక్ష్మి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ చిరంజీవి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గుర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గరికవలస జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అండర్ 14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 తేదీవరకు అనకాపల్లి జిల్లాలో లంకపాలెంలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు కేసవి పావని, సుమనము లక్ష్మీప్రసన్న ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంతో పాటు సర్పంచ్ జగన్నాథం, గ్రామస్థులు, పీడీ మల్లికార్జునరావు వారిని అభినందించారు.

భవిష్యత్ లక్ష్యాల సాధనకు కృషి

- ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి... భవిష్యత్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఎస్‌బీఐ సీఎస్సార్ పథకంలో భాగంగా స్థానిక ప్రభుత్వ మహారాజా సాంస్కృతిక కళాశాలలోని 16 మంది విద్యార్థినులకు గురువారం సైకిళ్లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ విద్యార్థినులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న వయస్సులో బాలికలను మభ్యపెడుతూ లైంగిక వేధింపులకు పాల్పడే వ్యక్తుల మాటలను నమ్మవద్దని అన్నారు. సోషల్ మీడియా రీల్స్ అంటూ సమయాన్ని వృధా చేస్తే, భవిష్యత్తులో బాధపడే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు. డిజిటల్ అరెస్టు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్‌బీఐ ప్రతినిధులు ఎం.సురేష్ బాబు, ఎం.రమేష్ కుమార్, పీఎస్ చారి, డీఈ ఓ వెంకట రమణ, డీఎస్పీ గోవిందరావు, టూ టౌన్ సీఐ శ్రీనివాసరావు, హెచ్‌ఎం లలితకుమారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థినితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

డ్రగ్స్ మహమ్మారితో యువత భవిష్యత్తు అంధకారం

- బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి

బొండపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారితో యువత భవిష్యత్తు అంధకారంగా మారుతోందని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం గొట్లాంలోని ఓ కళాశాల ఆవరణలో అభ్యుద య సైకిల్ యాత్రను ఉద్దేశించి డీఎస్పీ మాట్లా డారు. గంజాయికి యువత అలవాటు పడడం వల్ల శరీరంలోని ప్రతి అవయవంపై తీవ్ర ప్రభావం చూపుతుందని గుర్తు చేశారు. స్నేహితుల ఎంపిక పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. డ్రగ్స్ బారిన పడిన వారికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహనతో పాటు పునరావాసం కల్పించనున్నట్టు తెలిపారు. ఈ సైకిల్ యాత్రకు ఇన్‌చార్జి సీఐ నారాయణరావు, ఎస్ఐలు మహేష్, కిరణ్‌కుమార్‌నాయుడులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గోపాలరాజు, తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ ఎంపీడీవో గిరిబాల, కళాశాల కరస్పాండెంట్ జగదీశ్వరి, మండల టీడీపీ అధ్యక్షుడు రాపాక అచ్చుంనాయుడు, కళాశాల ఏవో రాఘవకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి



సీతానగరం: రైస్ మిల్లు యజమానితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వైశాలి

ధాన్యం తరలింపును పర్యవేక్షించాలి

సీతానగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు, మిల్లుల్లో ట్రక్ షీట్లు కటింగ్, జీపీఎస్ చేసిన వాహనాలతో ధాన్యం తరలింపు, తదితర అంశాలపై పర్యవేక్షించాలని సబ్ కలెక్టర్ వైశాలి గురువారం ఆదేశించారు. గురువారం మండలంలోని అప్పయ్యపేట, చినభోగిలి, తామరఖండి మిల్లుల్లో రైతుల నుంచి కొనుగోలు, ట్రక్ షీట్లు కటింగ్, మిల్లులకు తరలిస్తున్న ధాన్యం నిల్వలను పరిశీలించారు. అప్పయ్యపేట శ్రీసత్య రా అండ్ బోయల్డ్ మోడరన్ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలను, పీఏసీఎస్‌ల ద్వారా ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో బిల్లులు చెల్లించడానికి అవసరమైన చర్యలు, మిల్లుల యాజమాన్యాలు తీస్తున్న బ్యాంక్ గ్యారెంటీలు, ట్రక్ షీట్లను పరిశీలించారు. అనంతరం రామవరం రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్‌వో పి.కుమారస్వామి పాల్గొన్నారు.

రైతులకు చెల్లింపుల్లో జాప్యం వద్దు: జేసీ

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి సంబంధించి రైతులకు చెల్లింపుల్లో జాప్యం చేయవద్దని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి కోరారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం గరుగుబిల్లి తదితర గ్రామాల్లోని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని సకాలంలో నిల్వ చేయాలన్నారు. ధాన్యం సేకరణలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవన్నారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేయాలన్నారు. అనంతరం రావుపల్లిలోని రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ పి.బాల, డీటీ మారుతీరావు, వీఆర్వో బాలబాబు, కార్యదర్శి బి.అప్పారావు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో అధికారులతో మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి



కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత సిటీబస్టాండ్ వద్ద ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసం తొలి గురువారాన్ని పురస్కరించుకుని పాలభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఐటీడీఏలో అక్రమాలపై నివేదిక

- విచారణాధికారి, ట్రైకార్ ఎండీ మణికుమార్

సీతంపేట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో అక్రమాలపై విచారణ పూర్తయిన తరువాత ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని విచారణాధికారి, ట్రైకార్ ఎండీ మణికుమార్ తెలిపారు. సీతంపేట ఐటీడీఏలో వైసీపీ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదుల మేరకు గురువారం ట్రైకార్ ఎండీ మణికుమార్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మణికుమార్ విలేకరులతో మాట్లాడుతూ సీతంపేట ఐటీడీఏలో గతంలో సీఆర్‌టీల రెగ్యులర్, ఉపాధ్యాయుల బదిలీ, అక్రమ డిప్యుటేషన్లతో పాటు మొత్తంగా 19 అంశాలపై దళిత సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను విచారించేందుకు తాను వచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలు, డిప్యుటేషన్లకు సంబంధించిన ఫైళ్లు పరిశీలించామని, ప్రతి దాంట్లో అప్పటి ఐటీడీఏ పీవో సంతకాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఫిర్యాదు దారులు విచారణకు హాజరుకానందున వారికి మరో అవకాశం ఇస్తామని తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, డీడీ అన్నాదొర, అప్పటి సూపరింటెండెంట్ దేశ్‌లకు పలు అంశాలపై ప్రశ్నలు వేసారు.



విచారణ నిర్వహిస్తున్న మణికుమార్

మంచంపై రోగి తరలింపు

- నాలుగు రోజులుగా జ్వరం.. ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి..
- నీలకంఠాపురం నుంచి తోలంగూడ వరకు రోడ్డు నిర్మించాలని డిమాండ్

కురుపాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురం నుంచి తోలంగూడ వరకూ నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు లేకపోవడంతో తోలంగూడ గ్రామస్థులకు అగచాట్లు తప్పడం లేదు. గ్రామానికి 108 వంటి వాహనాలు సైతం వచ్చే అవకాశం కూడా లేదు. ఈనేపథ్యంలో తోలుంగూడకు చెందిన మండంగి కింబప్పు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో హుటాహుటిన గ్రామస్థులు మంచంపై పెట్టి గురువారం మోసుకుని గ్రామస్తులు నీలకంఠా పురం ఆసుపత్రిలో చేర్పించారు. 50 ఇళ్ల ఉండే ఈ గ్రామంలో 300 మంది నివసిస్తున్నారు. సీపీ ఎం నాయకుడు అడ్డమేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామానికి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థులకు అనారోగ్యం సమయంలో ఆసత్రికి తరలించేందుకు అవస్థలు పడుతున్నామని వాపోయారు.

రోగిని మంచంపై మోసుకుని వెళ్తున్న తోలంగూడ గ్రామస్థులు



న్యూస్ బాక్స్

బొత్సకు భద్రతా లోపంపై విచారణ

విజయనగరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణకు పైడిమాంబ సిరిమానోత్సవంలో కేటాయించిన వేదిక కూలిన ఘటనపై విచారణ చేపట్టాలని జీఏడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఇటీవల కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని ఆదేశించారు. బొత్స ప్రోటోకాల్, భద్రతా లోపంపై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై నివేదిక రూపొందించే పనిలో అధికార యంత్రాంగం ఉంది.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

రేగిడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంబాడ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, అభివృద్ధి పనుల్లో నాణ్యాత లోపాలపై గ్రామానికి చెందిన గొగులు తమ్మినాయుడు, మరో ఐదుగురు పాలకవర్గ సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విచారణ చేపట్టాలని వార్డు సభ్యులు పి.రామదేవి, మజ్జి పారమ్మ, జమ్మాన నర్సయ్య, డి.జ్యోతి, పి.వెంకటమ్మలు లిఖిత పూర్వకంగా కోరినట్టు తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

సంతకవిటి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర తూర్పుకాపు మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు అన్నారు. గురువారం మామిడిపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చెలికాని మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో అవకాశం

ఎస్.కోట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంతగైరమ్మపేట గ్రామానికి చెందిన వాయిద్య కళా కారుడు తీడ భాస్కరరావు విశాఖలోని ఆకాశవాణి కేంద్రం నిర్వహించిన సంగీత ప్రదర్శనలో పాల్గొని బీగ్రేడ్ సాధించారు. గత ఏడాది డిసెంబరులో విశాఖలో కర్ణాటక శాస్త్రీయ సంగీత వాయిద్య కళాకారుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొన్న భాస్కరరావు ఉత్తీర్ణత సాధించారు. ఇక నుంచి ఆకాశవాణిట జరిగే కచేరీల్లో తన వాయిద్య బృందంతో పాల్గొంటారు. దీనికి సంబంధించిన ధ్రువపత్రాన్ని ఆకాశవాణి ప్రోగ్రాం అధి కారి సుధాకర్‌రెడ్డి నుంచి అందుకున్నారు.

వ్యవసాయ విధానాలపై అవగాహన అవసరం

డెంకాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులందరూ సమగ్ర వ్యవసాయ విధానంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రబీ పంటలలో యాజమాన్య పద్ధతులపై గురువారం డెంకాడలో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నాగమాధవి పాల్గొన్నారు. నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.జోగినాయుడు, ఆత్మ పథక సంచాలకులు అనూరాధ, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీపీ వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం

గుర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కెల్ల పీఏసీఎస్ చైర్మన్ విమలారాణి మాతృమూర్తి కొలుకులూరి సరోజిని గురువారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ గోవిందరాజులు, ఎగ్జిక్యూటివ్ మెంబరు దాసరి శివప్రసాదరావుల సూచన మేరకు ఆమె కళ్లను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఈమేరకు విజయనగరం నుంచి టెక్నీషియన్ రమణను రప్పించి ఆమె నేత్రాలను సేకరించి విశాఖపట్టణం ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు.

దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు

విజయనగరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయిస్ డీఎం శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. 'బస్తాకు అదనంగా ఐదు కిలోలు' అనే శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై ఆమె స్పందించారు. రైతులు తూకం విషయంలో మోసపోకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రతి మిల్లు వద్ద కస్టోడియన్ అధికారిని నియమిస్తామని సివిల్ సప్లయిస్ డీఎం శాంతి తెలిపారు.

ఉత్సాహంగా ఎస్ఎఫ్ఐ మహాసభలు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ 33వ జిల్లా మహాసభలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వేలాది మంది విద్యార్థులతో గురజాడ కళాభారతి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము అధ్యక్షతన జరిగిన మహాసభలలో ఆల్ ఇండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ మాట్లాడుతూ దేశ ంలో విద్యపైన సాముహిక దాడి జరుగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం ప్రవేశపెట్టి చాలా మంది పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తూ వస్తున్నదన్నారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లాలో సరైన సౌకర్యాలు లేక ఎనిమిది మంది విద్యార్థులు చనిపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వెంకటేష్, చినబాబు, రవి కుమార్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో నెల్లిమర్లలో గురువారం జరిగిన పోలీసుల అభ్యుదయ ర్యాలీకి బంగార్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెండా ఊపి అభ్యుదయ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగానికి అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని అన్నారు. ఈ తరహా సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు, 1972 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల, విద్యార్థుల పేర్లు గోప్యంగా ఉంచుతారని బంగార్రాజు వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, జనసేన పార్టీ నాయకులు కరుమజ్జి గోవిందరావు, అంబల్ల అప్పలనాయుడు, ఎంఎం.నాయుడు, మిమ్స్ వైద్య కళాశాల ఏవో గణేష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.రేఖ తదితరులు పాల్గొన్నారు. నిమ్స్ వైద్య విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ అందరినీ ఆకట్టుకుంది.

అవయవ దానానికి ముందుకు రండి


ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అవయవదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రొటేరియన్, ఆప్తాలమిక్ ఆఫీసర్ వసంతరావు పిలుపునిచ్చారు. కిడ్నీ, గుండె, లివర్, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ముఖ్యమైన అవయవాల కోసం లక్షలాదిమంది ఎదురు చూస్తున్నారని అన్నారు. ఒకరి అవయవదానంతో ఎనిమిది మందికి వెలుగును ప్రసాదించవచ్చని ఆయన పేర్కొన్నారు. పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కా ర్యక్రమంలో హెచ్.ఎం. పద్మావతి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సత్యారావు, సంతోషి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పని చేసి...ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏవో మల్లికార్జునరావును ధాన్యం కొనుగోలుపై వివరాలు కోరారు. రైతులకు గోనె సంచులు అందించడంలో అలసత్వం వహిస్తున్నారని సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సరఫరాలో విఫలమయ్యారని ఆరోపించారు. నిర్వహణ సక్రమంగా లేక పంచాయతీలపై భారం పడుతోందని ఏఈ అలేఖ్య దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ చలంనాయుడు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారం కాక ప్రజలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని చెప్పారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆర్ఐకి తెలియజేశారు. మామూళ్లకు అలవాటు పడిన వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది మ్యూటేషన్లు తిరస్కరిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, ఎంపీడీవో గిరిబాల, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున కాలనీలో కమిషనర్ పర్యటన


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కమిషనర్

రాజాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సి పాలిటీ పరిధిలోని మల్లికార్జున కాలనీలో కమిషనర్ ఎ.రామ చంద్రరావు గురువారం పర్యటించారు. స్థానికులు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై స్పందించిన కాలనీలో కాలువలు, రోడ్ల నిర్మాణం చేపడతామని కమిషనర్ వివరించారు. ఇంటి, కుళాయి పన్నులను ప్రతి ఒక్కరు మార్చి నెలాఖరులోగా చెల్లించాలని సూచించారు. ఆయనతో సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

సంతకవిటి/రాజాం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్జీవో అధ్యక్షురాలు, కమ్యూనిటీ సోషల్ వెల్ఫేర్ అధికారి డి.పద్మ పిలుపునిచ్చారు. బొమ్మిన్నాయుడువలస, గార్రాజు చీపురుపల్లి గ్రామాలలో గురువారం బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.

ఆలోచింపజేసిన చిన్నారుల ప్రదర్శన


చిన్నారుల నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలపై జవహర్ బాలభవన్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, రాజాం టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్ సారథ్యంలో రాజాం పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్, కేర్ హాస్పిటల్ జంక్షన్, బొబ్బిలి జంక్షన్‌లలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను పాట రూపంలో వివరిస్తూ, వాటికి లయబద్ధంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆలోచింపజేశాయి. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, గట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

జనవరిలో ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

పరిశ్రమపై చర్యలు తీసుకోవడం లేదేం?

ఎస్.కోట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముషిడిపల్లి పంచాయతీలో మూడేళ్ల క్రితం ప్రభుత్వం స్థలాలు ఇస్తే ఇళ్లు కట్టలేదని పట్టాలు రద్దు చేసిన అధికారులు... 18ఏళ్ల క్రితం భూములు తీసుకొని..నేటికీ పరిశ్రమ స్థాపించని వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని జిందాల్ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం బొడ్డవర వద్ద తమ 167వ రోజు నిరసన దీక్షలో మట్లాడుతూ చాలమంది రైతులు తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణంలో నిర్వాసితులయ్యారని తెలిపారు. వారికి రెండోసారి ముషిడిపల్లి ప్రాంతంలో భూములు ఇచ్చారని... మరోసారి వీరి నుంచి భూములు సేకరించకూడదని చట్టం చెబుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈమేరకు నల్లజెండాలు చేతపట్టి నిరసన తెలిపారు.

మానవత్వంతో స్పందించి..

ఎస్.కోట రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో మతిస్థిమితం లేని మహిళ రోడ్డు ప్రమదానికి ఇబ్బందులు పడుతుండగా.. యువత, ఉద్యోగులు ఆదుకున్నారు. యాచన చేసుకుంటూ బతుకుతున్న ఒడిశాకు చెందిన మతిస్థిమితం లేని మహిళకు రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు తీవ్రంగా దెబ్బతిని లేవలేని స్థితికి చేరుకుంది. పంచాయతీ ఉద్యోగులు, చుట్టుపక్కల గ్రామాల యువత ఆ మహిళను ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. విషయం తెలుసుకున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సస్తైటీ చైర్మన్ బాలసతీష్ ఆ మహిళను పెందుర్తిలోని లయోలా ఓల్డేజ్ హోంలో చేర్పించారు.

విద్యార్థులకు అవగాహన

గరివిడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శివరాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు మాట్లాడుతూ బాలలకు రాజ్యాంగం ప్రకారం ఉన్న హక్కులను వివరించారు.

●రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిని దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ రాఘవులు సూచించారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన అవగాహన సదస్సులో రాజాం టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి పెట్టండి

చీపురుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లకు బదులు విద్యార్థులు చదరంగం వంటి ప్రయోజనకరమైన క్రీడలపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ డి.ధర్మరాజు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి చదరంగం పోటీల్లో విజేతలకు ఆయన గురువారం ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.దామోదరరావు, ఆర్బిటర్ ఏడీఎస్ఎల్‌వీ ప్రసాద్, పరిశీలకులు పీసీ స్వరూప్, సతీష్, మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో మేలు

దత్తిరాజేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో రైతులకు మేలు కలుగుతుందని ఏడీఏ భారతి అన్నారు. దాసరిపేట, మరడాం, దత్తి, టి.బూర్జవలస గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని గురువారం ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రబీలో ఎక్కువ చోడి పంట పండించాలని, ఉద్యాన పంటలైన ఆయిల్‌పాం విస్తీర్ణం పెంచాలన్నారు. ఆమె వెంట ఏవో అనూరాధ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ముప్పు

నెల్లిమర్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలతో ముప్పు తెచ్చుకోవద్దని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ పి.పల్లవి హితవు పలికారు. అభ్యుదయం ర్యాలీ గురువారం వర్సిటీకి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉన్నపుడే ఉన్నత లక్ష్యాలు చేరుకోగలరని అన్నారు. భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నట్టు సమాచారం తెలిస్తే 1972 లేదా 112 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో పల్లవికి బంగారు పతకం


బంగారు పతకంతో పల్లవి

నెల్లిమర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన శనపతి పల్లవి 69 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించిందని కోచ్ చల్లా రాము చెప్పారు. పల్లవి ఈ పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరఫున పాల్గొన్నదని తెలిపారు. మొత్తం 190 కిలోల బరువులు ఎత్తిందని ఆయన వెల్లడించారు.

క్రైం న్యూస్

కాలువలో పడి హెల్త్ అసిస్టెంట్ మృతి

పాచిపెంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంచాలి సమీపంలో పామాయిల్ కాటా దగ్గర కాలువలో బుధవారం సాయంత్రం మోటారు వాహనంతో వెళ్తున్న హెల్త్ అసిస్టెంట్ పడిపోవడంతో మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లాలోని రామభద్రపురానికి చెందిన సింగారపు మోహనరావు (30) పాచిపెంట మండలంలోని గురువునాయుడుపేట పీహెచ్‌సీలో మోహనరావు హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రతి రోజూ రామభద్రపురం నుంచి గురువునాయుడుపేటకు తన నివాసం నుంచి డ్యూటీకి వెళ్లి వచ్చేవాడు. ఇటీవల మోహనరావుకు అనారోగ్యం వల్ల తన భార్య సింగారపు శశ్యకుమారి తోడుగా గురువునాయుడుపేట వెళ్లేది. అయితే బుధవారం ఆమె అనివార్య కారణాల వల్ల భర్తతో పాటు వెళ్లలేకపోయింది. యథావిధిగా డ్యూటీకి వెళ్లి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంతో పాటు మోహనరావు కాలువలో పడిపోయాడు. దీంతో మోహనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య శశ్య కుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.వెంకటసురేష్ కేసు నమోదు చే శా రు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సీహెచ్‌సీకి తరలించారు.

12 మంది బైండోవర్

బొండపల్లి (గజపతినగరం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గజపతినగరం మండల పరిధిలో అనధికారికంగా బెల్టు షాపులు నిర్వహించి, అక్రమంగా మద్యం నిల్వ చేసిన 12 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. దీంతో గురువారం ఎక్సైజ్ సీఐ కె.జనార్దనరావు, ఎస్ఐ పి.శాంతిలక్ష్మి, స్థానిక తహసీల్దార్ పి.రత్నకుమారి ఎదుట హాజరుపరిచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సంతకవిటిలో...


అక్రమ మద్యం అమ్మినవారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచిన దృశ్యం

సంతకవిటి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికార మద్యం అమ్మకాలు సాగిస్తూ పట్టుబడిన ఐదుగురిని స్థానిక తహసీల్దార్ ఎదుట గురువారం బైండోవర్ చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, భవిష్యత్తులో ఇలాంటి నేరాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

విజయనగరం క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయనగరం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బంది చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 10 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిని గురువారం కోర్టులో హాజరుపరిచారు. విజయనగరం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీవిద్య వీరిలో ఇద్దరికి ఐదు రోజులు జైలుశిక్ష, 8 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ దామోదర్ తెలిపారు.

ముగ్గురికి అపరాధ రుసుం

రేగిడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో ఎ బాలికావలసకు చెందిన ఎస్.కృష్ణ, పనసలవలసకు చెందిన ఎం.శంకరరావు, బహిరంగంగా మద్యం తాగిన బాలికావలస గ్రామానికి చెందిన వై.తిరుపతికి రాజాం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు అపరాధ రుసుం విధించింది. ఎస్ఐ బాలకృష్ణ ఈ విషయాన్ని గురువారం విలేకరులకు తెలిపారు. కృష్ణకు రూ.8వేలు, శంకరరావుకు రూ.5వేలు, తిరుపతికి రూ.300 అపరాధ రుసుం విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


సంఘటన స్థలంలో ఉన్న వాహనాలు

గంట్యాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసాది గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నీలావతి గ్రామానికి చెందిన కింతాడ మంగమ్మ గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వసాది గ్రామం వద్ద ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిల్, ఆటో బలంగా ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో ఉన్న మంగమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు 108 వాహనంలో ఆమెను జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

కొత్తవలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుని ఇప్పుడు కట్నం తేవాలని వేధిస్తున్నాడంటూ ఓ వివాహిత తన భర్త, అత్తమామలు, ఆడపడుచుపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస రాంజీనగర్‌లో నివాసం ఉంటున్న పుచ్చా జ్ఞానేశ్వరి, విజయనగరానికి చెందిన కేశవ రాము ప్రేమించుకున్నారు. ఈ ఏడాది మే నెల 5న వీరికి వివాహమైంది. వివాహమైన కొద్ది రోజుల నుంచే రూ.15 లక్షల కట్నం, 10 తులాల బంగారం, మోటార్ సైకిల్ ఇవ్వాలంటూ తన భర్త, అత్త, మామ, ఆడపడుచు వేధింపులకు గురిచేస్తున్నారని గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మహిళ మెడలోని హారం చోరీ

చీపురుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తగ్రహారంలో గుర్తు తెలియని వ్యక్తి మహిళ మెడలో నల్లపూసల హారాన్ని తెంపుకొని పరారయ్యాడు. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం కొత్తగ్రహారానికి చెందిన మహంతి అనూష అనే మహిళ బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో సమీపంలో ఉన్న శివాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 2.5 తులాల బరువు గల నల్లపూసల హారాన్ని లాక్కొని పరారయ్యాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి, పరిసరాలన్నీ వెతికారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో బడ్డీ దగ్ధం

రాజాం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఓ హాస్పిటల్ జంక్షన్ వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ బడ్డీ దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.30 వేల ఆస్తినష్టం ఉంటుందని ప్రాథమిక అంచనా.

పాఠశాలకు విరాళం

రాజాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బొద్దాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వైస్ ఎంపీపీ నక్క వర్షిణీ మోహన్ గురువారం రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని హెచ్‌ఎం గురుమూర్తికి అందజేశారు

చంద్రబాబు రైతుల పక్షపాతి

● ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



గరుగుబిల్లి: నందివానివలసలో మహిళకు రైతన్నా-మీకోసం కార్యక్రమం కరపత్రం అందజేస్తున్న తోయక జగదీశ్వరి

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు రైతుల పక్షపాతిగా నిలుస్తున్నారని, రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పలు పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. గురువారం నందివానివలసలో రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొందని, సాగునీటి ప్రాజెక్టులపై చిన్నచూపు చూసి తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.అనంతరం గ్రామంలోని పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. పునరావాస గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పనతో పాటు రహదారులు మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు వినతులు అందించారు.కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్ అంబటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, నారాయణస్వామి, దేవస్థానం చైర్మన్ ఎం.పకీరునాయుడు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, ఏవో టి.జ్యోత్న పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మెరమలో రైతన్నా-మీ కోసం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కురపాం ఏఎంసీ చైర్మన్ క ద్రక కళావతి, గోపాలరావు, కార్తీక, కిమిడి భూషణరావు, శివకుమార్, సతమ్మ, భాస్కరరావు పాల్గొన్నారు.

సర్వే సమగ్రంగా నిర్వహించాలి

●పాలకొండ సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్



పాలకొండ: రైస్‌మిల్లులో తనిఖీచేస్తున్న పవార్ స్వప్నిల్ జగన్నాథ్

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామకంఠాల్లో స్వామిత్వ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సూచించారు.గురువారం మండలంలోని మంగళాపురంలో జరుగుతున్న గ్రామ కంఠంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలు, మోహమాటాలకు తావివ్వకుండా సర్వే నిర్వహించాలన్నారు. పంచాయతీ ఆస్తులు గుర్తించి ఆ వివరాలు రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని నిర్మాణంలో ఉన్న ఆయుష్మాన్‌భవ ఆరోగ్యమందిరం పనులను పరిశీలించారు. సింగన్నవలస సెంటర్‌లో ఉన్న అప్పన్నమ్మ రైస్‌మిల్లును తనిఖీ చేశారు.

సర్‌పై బీఎల్వోలకు శిక్షణ

సీతంపేట రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ఐటీడీఏ కార్యాలయంలో సీతంపేట, భామిని మండలాల్లోని బీఎల్వోలకు గురువారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై(సర్) పాలకొండ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన నూతన నిబంధనల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఏవిధంగా చేపట్టాలి, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీతంపేట, భామిని మండలాల తహశీల్దార్లు శ్రీకన్య, శివన్నారాయణ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు రాణించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవోను జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, హెచ్‌డబ్ల్యువో పి.అమల, పీడీలు,పీఈటీలు కలిశారు.

కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమపూజలు

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటదుర్గమ్మ ఆలయంలో మార్గశిర మొదటి గురువారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ముర్రాటలు సమర్పించారు. అ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసశర్మ, లత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మక్కువ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీడీవో ఎన్.అర్జునరావు తెలిపారు. గురువారం శంబర ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం రోగులకోసం పంపిణీచేస్తున్న మందులు, వైద్య సిబ్బంది హాజరు,ప్రజలకు వచ్చే ఆరోగ్యసమస్యలపై వైద్యాధికారి తీసుకుంటున్న చర్యల గురించి డాక్టర్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శంబర జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజన పథకం అమలును, గ్రామసచివాలయంలో సిబ్బంది హాజరు, ప్రభుత్వ పథకాల అమలుపై రికార్డులను పరిశీలించారు.

తోటపల్లి ఆలయంలో వేలంపాట

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలోని వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో గురువారం ఈవో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొబ్బరి చెక్కలను రెండేళ్లకు గాను రూ. 1.47 లక్షలకు డొల్లు గోవిందనాయుడు వేలంపాట కైవసం చేసుకున్నారు. తలనీలాల స్టాక్‌కు సంబంధించి 10 నుంచి 24 అంగుళం పైబడి ఉన్న స్టాక్‌ను ఎం.విజయ్ కుమార్ కిలోకు రూ. 16,200లు చొప్పున దక్కించుకున్నారు. 6 నుంచి 10 అంగుళం పైబడి ఉన్న స్టాక్‌ను డి.సత్యనారాయణ కిలో రూ. 4,480లు చొప్పున వేలం దక్కించుకున్నారు.కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ ఎం.పకీరునాయుడు, జూనియర్ సహాయకులు ఇందిర, సిబ్బంది జి.శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో ముందుకువెళ్లాలి

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోషల్ ఆడిట్ టీం, ఉపాధి సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాలని ఎంపీపీ బొమ్మళి భాను కోరారు. పాలకొండ వెలుగుకార్యాలయంలో ఉపాధి హామీ పథకానికి సం బంధించి సోషల్‌ఆడిట్ బృందం, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం పెంపొందించుకొని ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని డీఐఈవోపై నాగేశ్వరరావు కోరారు. వీరఘట్టం విద్యుత్ కేంద్రంలో జూనియర్ కళాశాల వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు నిర్వహించిన ఆన్‌జాబ్ ట్రైనింగ్‌ప్రోగ్రామ్‌ను నాగేశ్వరరావుతనిఖీచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ త్రినాథ్ పాల్గొన్నారు.

విక్రంపురంలో పేకాట శిబిరంపై దాడి

వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విక్రంపురం సమీపంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు.ఈ మేరకు 4,050 రూపాయలు నగదు స్వాధీనంచేసుకుని, ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

●కలెక్టర్ ప్రభాకరరెడ్డి పిలుపు

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సుంకి ప్రాంతంలోని తోటపల్లి ప్రాజెక్టుకు ఆనుకుని ఉన్న పార్వతీపురం ఐటీడీఏ పార్క్ ప్రాంతంలోని ఎనిమిది దుకాణ గదులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. జిల్లా గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. పార్కు ప్రాంతంలో వ్యాపారాలు చేసు కునేందుకు పలువురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, నిత్యం ఇక్కడకు వచ్చే పర్యాటకులకోసం వారికి ఆమోదకరమైన సామగ్రిని అందు బాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, ఎంపీడీవో జి.పైడి తల్లి,ఏపీఎం పి.అప్పలనాయుడుతోపాటు సీసీలు రామినాయుడు, సీహెచ్ తిరుపతిరావు, మహిళా సమైఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంక్షేమానికి కృషి

బెలగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పాత్రికేయులకు ఏర్పాటు చేసిన కంటి పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన వారికి ఆపరేషన్ చేయిస్తామని, కొంతమందికి కళ్లజోళ్లు ఉచితంగా ఇచ్చామని తెలిపారు.



ఐటీడీఏ పార్కులో దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కరరావు, నగేష్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత లేకపోతే నిధులు నిలిపివేస్తాం

●జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు



మక్కువలో పారిశుధ్యపనులను పరిశీలిస్తున్న కొండలరావు

మక్కువ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టని పంచాయతీలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను నిలిపివేస్తామని మన్యం జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు హెచ్చరించారు. గురువారం మక్కువలో జరుగుతున్న పారిశుధ్యకార్యక్రమాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో విధిగా పారిశుధ్యకార్యక్రమాలు చేపట్టి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలాచర్యలు తీసుకోవాలని, పనులు చేపట్టని పంచాయతీలకు ప్రభుత్వంనుంచి విడుదలయ్యే నిధులను నిలిపివేయాలని ఎంపీడీవో అర్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణలను ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుచేసేలా కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది చర్యలుతీసుకో వాలని కోరారు. వ్యాపారులు షాపులవద్ద చెత్తను బయటపారవేయకుండా చెత్తబుట్టను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీడీవోకార్యాలయంలో అధికారులతో సమావేశమై పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధిపనులపై సమీక్షించారు.కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.అర్జునరావు, మక్కువ గ్రామకార్యదర్శి బి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి చర్యలు

●ఏఐసీసీ పరిశీలకుడు దేబాషిస్ పట్నాయక్



మాట్లాడుతున్న దేబాషిస్ పట్నాయక్

బెలగాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఏఐసీసీ పరిశీలకుడు, ఒడిశాకు చెందిన ఎమ్మెల్యే దేబాషిస్ పట్నాయక్ తెలిపారు. గురువారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాల్లో పర్యటించి బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజలసమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు జగత శ్రీనివాసరావు, డీసీసీ నాయకుడు బుల్లిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన మోహన్‌రావు, నాయకులు దాలినాయుడు, కోలా కిరణ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్లు మంజూరు

● పార్వతీపురం గృహ నిర్మాణశాఖ ఈఈ సోమేశ్వరరావు



గరుగుబిల్లిలో సర్వేను పరిశీలిస్తున్న గృహ నిర్మాణశాఖ ఈఈ సోమేశ్వరరావు

గరుగుబిల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకే ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లను మంజూరు చేయనున్నట్లు పార్వతీపురం గృహ నిర్మాణశాఖ ఈఈ జి.సోమేశ్వరరావు తెలిపారు. గురువారం గరుగుబిల్లిలో ఆవాస్ యోజన పథకం ఇళ్లకోసం సర్వే నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 25 పంచాయతీల నుంచి 1,784 మంది దరఖాస్తు చేసుకోగా, 715 పరిశీలించినట్లు చెప్పారు. పంచాయతీల పరిధిలో సర్వే నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు చెప్పారు. నిర్మాణానికి స్థలం లేకున్నా దరఖాస్తు చేసుకోవచ్చని, స్థలం ఉంటే సంబంధిత లబ్ధిదారునితో జియోట్యాగింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 29లోగా సర్వే పూర్తికావాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీవో జి.పైడితల్లి, ఏఈ వి.అఖిల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.భాస్కరరావు ఉన్నారు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాన్ని పెంపొందించే ప్రతి పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో ఐవీ లక్ష్మి కోరారు. గుమ్మలక్ష్మీపురం శాఖాగ్రంథాలయంలో పాఠకులకుఅందుబాటులోఉన్న కథలు,నవలలు, పత్రికలను పరిశీలించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సుకన్య పాల్గొన్నారు.

చెక్‌పోస్టులో నిరంతరం తనిఖీలుచేయాలి: డీఎస్పీ

పాచిపెంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిరంతరం పటిష్టమైన తనిఖీలు నిర్వహించాలని పార్వతీపురం డీఎస్పీ మనీషారెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని పి.కోనవలస సమీపంలో గల ఆంధ్రా - ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించారు.తొలుత పాచిపెంట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. చెక్‌పోస్టులో ఆంధ్రా - ఒడిశా నుంచి వచ్చిపోయే వాహనాల రాకపోకల గురించి అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల కదలికలను గమనించాలని సూచించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కె.వెంకటసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న మనీషారెడ్డి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పాలకొండ ఫీడర్‌కు ఆనుకొని ఉన్న చెట్లు, చెట్లకొమ్మలు తొలగించడం, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు 33/11 కేవీ పాలకొండ ఎస్ఎస్ పరిధిలో ఉండేగ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ కె.విష్ణుమూర్తి పేర్కొన్నారు.

వేగావతినదిలో జీపు బోల్తా

మక్కువ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలోని శివరామపురం సమీపంలో గల వేగావతి నదిలో కాజ్‌వేపై నుంచి గురువారం జీపు బోల్తా పడింది. బొబ్బిలి మండలంలోని గోపాలపట్నంనుంచి ఒడిశా వాసులు ఆవుదూడను కొనుగోలు చేసి జీపులో ఎక్కించుకొని శివరామపురం మీదుగా సాలూరు వచ్చేందుకు వేగావతి నది కాజ్‌వే దాటుతుండగా నీటి ఉధృతికి జీపు బోల్తాపడింది. దీంతో ఆవు దూడతోపాటు డ్రైవరు నీటిలో పడికొట్టుకు పోతుండగా అక్కడే ఉన్న కొంతమంది శివరామపురం గ్రామస్థులు అప్రమత్తమై కాపాడారు. బోల్తాపడిన జీపును ట్రాక్టరు సహాంతో బయటకు తీశారు.

పుస్తెలతాడు చోరీ

వీరఘట్టం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూడి, పాలమెట్ట రహదారిలో గురువారం పొలంపనులు పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వస్తున్న పాలమెట్ట గ్రామా నికి చెందిన రాగోలు అన్నపూర్ణమ్మ మెడలోని రెండు తూలాల పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు.ఆమె నడిచి వస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చి కంట్లో కారంపొడి చల్లిపుస్తెలతాడు లాక్కుపోయారని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పౌర సేవలకు నిరీక్షణ!

(3వ పేజీ తరువాయి)

బుట్టదాఖలు అవుతుండడంతో ప్రజలు అపరిశుభ్రత మధ్య జీవిస్తున్నారు. జనన ధ్రువపత్రం ఐదు రోజుల్లో మంజూరు చేయాల్సి ఉన్నా, వారం రోజులకు పైగా సమయం తీసుకుంటున్నారు. జనన ధ్రువపత్రంలో పేరు సరి చేసేందుకు అవసరమైన నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ కోసం ఏడు రోజుల సమయం తీసుకోవాలి. కానీ, చాలా ఆలస్యం చేస్తున్నారు. దీంతో ఆ ధ్రువపత్రం కోసం దరఖాస్తుదారులు మునిసిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. వ్యాపారాలకు సంబంధించిన లైసెన్స్‌ల మంజూరు, రెన్యూవల్ వారం రోజుల్లో జరగాలి. ప్రజారోగ్యశాఖ అధికారులతో మంచిగా ఉన్న వ్యాపారుల పని సులువుగా జరిగిపోతుంది. విద్యాసంస్థలకు సంబంధించి శానటరీ ధ్రువపత్రం 15 రోజుల్లో మంజూరు చేయాల్సి ఉంది. ఆయా విద్యాసంస్థల యాజమాన్యం తీరును బట్టి ఈ పత్రాలు మంజూరవుతు న్నాయి. భవన నిర్మాణ అనుమతులు, మాస్టర్ ప్లాన్ ప్రకారం స్థలం వినియోగించుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను 15 రోజుల్లో ఇవ్వాలి. అయితే, వీటిని పొందేందుకు సంబంధిత యజమానులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

పక్కాగా అమలు చేస్తాం

సిటిజన్ చార్టర్‌లో ఉన్న ప్రతి సేవనూ పక్కాగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక విభాగాలకు వచ్చిన దరఖాస్తులు, వినతులను నిర్దిష్ట సమయంలో పరిష్కరించేలా చర్యలు చేపడతాం. త్వరలోనే అన్ని విభాగాల అధికారులతో చర్చించి, సిటిజన్ చార్టర్ సేవలు ప్రజలకు సకాలంలో అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం.

- కె.కిషోర్‌కుమార్, కమిషనర్, పార్వతీపురం మునిసిపాలిటీ

లక్ష్యం ఎక్కువ.. కొనుగోలు తక్కువ

(3వ పేజీ తరువాయి)

కోసం వ్యాపారుల వద్ద ముందుగానే అప్పు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారికే ధాన్యం విక్రయించాల్సి వస్తోంది. వీరు కొనుగోలు చేసిన ధాన్యం ఇతర జిల్లాల్లోని మిల్లులకు తరలి వెళుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో దళారులు రంగ ప్రవేశం చేసి రైతులను దోచుకుంటున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తమకు నచ్చిన వ్యాపారికి నచ్చిన రేటుకు విక్రయించుకుంటున్నారు. ప్రస్తుతం రైతుల ఆర్థిక అవసరాలు దళారుల పాలిట కాసుల పంటగా మారింది.

వేగవంతంగానే చేపడుతున్నాం..

జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగవంతంగానే చేపడుతున్నాం. గత సంవత్సరం ఇదే సమయానికి 9 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 7,800 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. బ్యాంకు గ్యారెంటీలను ఇప్పటివరకు 50 మంది మిల్లర్లు అందించారు. ఈ ఏడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని చేరుకుంటాం.

-శ్రీనివాసరావు, జిల్లా సివిల్ సప్లయిస్ శాఖ, మేనేజర్

పర్యాటక కేంద్రంగా తోటపల్లి

(3వ పేజీ తరువాయి)

అప్పగించామన్నారు. ఐటీడీఏ పార్కు, బోటు షికారును సద్వినియోగం చేసుకోవాలని పర్యాటకులను కోరారు. పార్కు ప్రాంతంలో అవసరమైన సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, కార్పొరేషన డైరెక్టర్లు ఎ.మధుసూదనరావు, అంబటి గౌరునాయుడు, సర్పంచ్ కె.రవీంద్ర, ఎంపీటీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, వై.శ్రీనివాసరావు, పార్టీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటినాయుడు, నారాయణస్వామి, ఎంపీడీవో జి.పైడితల్లి, తహసీల్దార్ పి.బాల, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

అక్విడక్ట్ పూర్తికాక.. సాగునీరు అందక

(3వ పేజీ తరువాయి)

పనులు జరిగాయి. ఆ తరువాత నిధుల కొరత ఏర్పడడంతో పనులు నిలిచిపోయాయి. ఐదేళ్ల వరకు ఈ పనుల్లో ఎటువంటి కదలిక కనిపించలేదు. 2020లో వెంగళరాయ ప్రాజెక్టు ఆధునికీకరణకు జైకా నిధులు రూ. 63 కోట్లు మంజూరయ్యాయి. 2021లో అక్విడక్ట్ పనులు, 2022లో కాలువ లైనింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అక్విడక్ట్‌లో నాలుగు పిల్లర్లు, ఐదు శ్లాబ్‌లను పూర్తి చేశారు. కుడి ప్రధాన కాలువలో 700 మీటర్ల వరకు లైనింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులను చెల్లించకపోవడంతో ఈ పనులు మళ్లీ నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు కోసం మంజూరైన నిధులను వైసీపీ సర్కారు వేరే పనులకు మళ్లించిందనే ఆరోపణలు ఉన్నాయి. వెంగళరాయ ప్రాజెక్టు ప్రారంభం నుంచి నేటివరకూ ఎడమ ప్రధానకాలువ పరిధిలోని శివారు భూములకు ఇంతవరకు పట్టుమని పది ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదు.కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకొని అక్విడక్ట్ నిర్మాణం పూర్తిచేసి పూర్తిస్థా యిలో నీందించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మక్కువ రూరల్, 27(ఆంధ్రజ్యోతి): పనసభద్రలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు, వెంకటభైరిపురంలో కోపరేటివ్‌బ్యాంక్ వద్ద అధ్యక్షులు దాకేటి గౌరునాయుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏవో చింతల భారతి, రౌతు రామారావు పాల్గొన్నారు.

● జియ్యమ్మవలస, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపురం కోఆపరేటివ్ సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ప్రెసిడెంట్ డి.సోములుతో కలిసి ఎంపీపీ బొంగు సురేష్ ప్రారంభించారు.కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జోగి భుజంగరావు, కోఆపరేటివ్ సొసైటీ సీఈవో సీహెచ్ తిరుపతిరావు, బీజేపురం, బొమ్మిక సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డిసెంబరు 8న ఏపీఎన్జీవో సాలూరు తాలుకా యూనిట్ ఎన్నికలు

సాలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ అధికారుల సంఘం సాలూరు తాలూకా యూనిట్‌ఎన్నికలు డిసెంబరు ఎనిమిదోతేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణ, అసిస్టెంట్ ఎన్నికలఅధికారి ఎస్.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 500 మంది ఉద్యోగులుసభ్యులుగా ఉన్న ఈయూనిట్‌లో 15 పోస్టులకు డిసెంబరు ఒకటో తేదీ నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు.